అపరాల సాగుకు యాంత్రీకరణ గండం

- లక్ష్యం 4,050 వేల హెక్టార్లు
- ప్రస్తుతం 400 హెక్టార్లలోనే సాగు
- మార్కెట్‌లో పప్పు ధాన్యాల కొరత


యాంత్రీకరణతో గోతులమయంగా మారుతున్న సాగు భూములు

పెదవేగి : ఏటా తగ్గుతున్న అపరాల సాగు పప్పు ధాన్యాల కొరతను పెంచుతోంది. యంత్రాలతో వరి కోతల వల్ల ఒక పక్క పశుగ్రాసానికి మరో పక్క అపరాల సాగుకు ముప్పు ఏర్పడుతోంది. మరో వైపు సాగునీటి ఎద్దడికి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో అపరాలు సాగు చేసే పరిస్థితి లేకుండా పోతోంది. యాంత్రీకరణతో అనేక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారుల ప్రచారంతో యాంత్రీకరణ అనూహ్య రీతిలో పెరిగింది. ఈ పరిస్థితి రైతులకు ఒక విధంగా మేలు చేస్తుండగా అపరాల సాగుపై మాత్రం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

పశుగ్రాసానికి ఇబ్బందులు

దెందులూరు నియోజకవర్గంలో వరిసాగులో యాంత్రీకరణ పెరగడంతో పెట్టుబడి రైతులకు ఒక రకంగా లాభం కలుగుతున్నా అపరాల సాగుపై తీవ్ర ప్రభావం పడి సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. యంత్రాలతో కోసిన పొలాల్లో గడ్డి ఉపయోగపడకపోవడంతో పశుగ్రాసానికి రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. కోత యంత్రాలవల్ల మడుగు గోతులు పడి అపరాల సాగుకు ఏ మాత్రం అనుకూలంగా లేకుండా తయారవుతున్నాయి. సాధారణంగా రైతులు కోతలకు రెండురోజుల ముందుగా నానబెట్టి మొలకలు వస్తున్న అపరాలను చల్లుతారు. కోతలు పూర్తయిన వెంటనే అవి మొలకెత్తి మొక్కలుగా తయారవుతాయి. యంత్రాలతో కోతలు కోస్తున్న పొలాలు గోతులు పడడంతో పాటు యంత్రం వరి దుబ్బులను నలిపివేయడం, భూమిపై ఒత్తిడి తేవడం వల్ల అపరాలను వేసినా మొక్కలు రావడం లేదు. దీంతో ఈ పొలాల్లో రైతులు అపరాల సాగు నిలిపి వేస్తున్నారు.

చీడపీడలూ ఒక కారణం

అపరాల సాగుకు అధిక శాతం చీడపీడల వల్ల నష్టం వాటిల్లుతోంది. కొన్నేళ్లుగా అపరాల పంటలకు తెగుళ్ల పట్టి పీడిస్తున్నాయి. దీంతో రైతులు అపరాలు సాగుకు వెనుకంజ వేస్తున్నారు. నష్టాన్ని భరించే బదులు సాగు చేపట్టకపోవడం మంచిదని అధిక శాతం రైతులు భావిస్తున్నారు. దీంతో పప్పు ధాన్యాల ఉత్పత్తి పడిపోతోంది. వచ్చిన నష్టాన్ని పాలకులు ఆదుకోనందున అపరాల సాగు చేయడం కష్టంగా ఉందని రైతులు అంటున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

నియోజకవర్గంలో 4,900 వేల హెక్టార్లలో రబీ సాగు చేస్తుంటారు. ఏటా సుమారు 2,300 వేల హెక్టార్లలో అపరాల సాగు చేస్తుంటారు. ఐదేళ్ల నుంచి అపరాల సాగు క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది రబీలో 4,050వేల హెక్టార్లలో అపరాల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖాధికారులు నిర్ణయించగా, ఇప్పటికీ వెయ్యి ఎకరాల్లో మాత్రమే అపరాల సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఆలస్యం కూడా కారణమే

ప్రస్తుత సాగు విధానంలో వచ్చిన మార్పులు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రబీ సాగు ఆలస్యం కావడం కూడా అపరాల సాగుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. సాధారణంగా ఏటా డిసెంబర్ నాటికి ఖరీఫ్ కోతలు పూర్తయ్యి జనవరిలో రబీ నాట్లు పూర్తయితే అపరాల సాగు సక్రమంగా ఉంటుంది. అపరాల పంట కాల పరిమితి 60 నుంచి 70 రోజులు కావడంతో మార్చి నెలాఖరుకల్లా రబీ కోతలు పూర్తయితే ఎండలు ముదురుతున్నా భూమిలో తేమకు మంచి దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఏప్రిల్ నెలాఖరు వరకు రబీ కోతలు పూర్తి కాకపోవడంతో అపరాలు వేసినా నాటుకునే పరిస్థితి తక్కువగా ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తెగుళ్లను తట్టుకునే విత్తనాల తయారీని రైతులు విస్మరించడంతో అపరాల సాగు భారీగా తగ్గిపోయిందంటున్నారు. అపరాల సాగుపై అవగాహన పెంచి అపరాల ఉత్పత్తి పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇప్పుడు వేస్తే నష్టమే

నియోజకవర్గంలో ఈ ఏడాది 4,050 వేల హెక్టార్లలో అపరాల సాగు లక్ష్యంగా జిల్లా ఉన్నతాధికారులే నిర్ణయించారు. ఇప్పుడు అపరాల సాగు చేస్తే తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉంది. ఇక అపరాలు వేయవద్దని చెబుతున్నాం. యాంత్రీకరణ, సాగునీటి ఎద్దడి అపరాల సాగుకు ఆటంకాలుగా మారాయి. పదును లేక చాలా చోట్ల అపరాలు వేయడం కుదరలేదు.

– ప్రియాంక, వ్యవసాయ శాఖాధికారి, పెదవేగి

క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ


సానిగూడెంలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న మండల ఏపీఓ

దెందులూరు: గ్రామాల్లో కూలీలు ఎండబారిన పడకుండా త్వరితగతిన పనులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరాలని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. శుక్రవారం సానిగూడెంలో ఉపాధి పనులను, మస్తర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీల్లో 9,946 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు చేస్తున్న పనులను, మస్తర్లను జవాబుదారీతనంగా తనిఖీ చేయాలన్నారు. సానిగూడెం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు మద్దా జయరాజు, మేట్లు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

జాయింట్ కలెక్టర్, ఆర్వో లావణ్యవేణి


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దెందులూరు నియోజకవర్గ ఈవీఎం ప్యాడ్స్ స్ట్రాంగ్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏపీఎస్పీ, ఏఆర్, కేంద్ర సాయుధ బలగాలతో స్ట్రాంగ్ రూం వద్ద భద్రత ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రజక చెరువుల్లో పూడిక తొలగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక వృత్తిదారుల చెరువులను ఉపాధి హామీ పథకంలో పూడికలు తీయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంఘస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో అనేక రజక వృత్తిదారుల చెరువులు పూడికలతో నిండిపోయాయని, మరికొన్ని ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. తక్షణమే ఎన్ఆర్‌జీఎస్ పథకంలో చెరువుల పూడికలను తొలగించాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం రజకులను ఆదుకోవాలని కోరారు. వీరి వృత్తి చెరువుకు సంబంధించి జూన్,30తో లీజు గడువు ముగుస్తుందన్నారు. వీరికి వచ్చే మూడేళ్లకు సంబంధించి లీజు నిర్ణయించేటప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు విధించాలని కోరారు. కానూరు అగ్రహారం రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గన్నవరపు వెంకన్న, ఉపాధ్యక్షుడిగా జి.రాంబాబు, కార్యదర్శిగా కె.సాంబయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు రచయితల సంఘం వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పశ్చిమ గోదావరి జిల్లా రచయితల సంఘం 4వ వార్షికోత్సవం ఈ నెల19వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా వెంకటేశ్వర్లు, బీ.నాగాస్త ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ చరిత్రకారుడు కొప్పర్తి వెంకట రమణమూర్తి, విశిష్ట అతిథులుగా తెలుగుభాష ఉద్యమకారుడు జీవీ పూర్ణచందు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ అబ్రహం, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు. నాట్యాచారిణి పార్వతీ రామచంద్రన్ శిష్యుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ప్రజా గాయకుడు మంగరాజు ఆధ్వర్యంలో చైతన్య గీతాలాపన ఉంటుందన్నారు. ప్రముఖ సినీ కవి రసరాజుకు నండూరి వెంకట సుబ్బారావు స్మారక సాహిత్య పురస్కారం, సామాజికవేత్త బీకేఎస్ఆర్ అయ్యంగార్‌కు తొలి చరిత్రకారుడు కావలి బొర్రయ్య స్మారక పురస్కారం, టీవీ, సినీ నటుడు పీ. విజయకుమార్‌కు బందా కనకలింగేశ్వరరావు స్మారక పురస్కారం, రేవతి రామ్‌కుమార్‌కు చల్లపల్లి సీతాదేవి స్మారక సంగీత పురస్కారం ప్రదానం చేస్తామన్నారు.

కలెక్టర్‌కు అభినందన


కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను సత్కరిస్తున్న జిల్లా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ నాయకులు

ఏలూరు(మెట్రో): ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమర్థవంతంగా పనిచేశారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు అన్నారు. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కనిచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైందన్నారు. స్వీప్ ద్వారా ఓటరుని చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చక్కగా చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది చాలా బాగా పని చేశారని అభినందించారు. త్వరలోనే వారిని సత్కరిస్తామన్నారు. ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్న మెడికల్ సిబ్బందికి కూడా రెమ్యునరేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఏలూరు తాలూకా అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, నాయకులు నోరి శ్రీనివాస్, నారాయణ నాయుడు, నరేంద్ర, పూడి శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

19 నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, కల్యాణం నిర్వహించనున్న వేదిక

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో పునఃనిర్మించిన విషయం అందరికీ తెలిసింది. 80 ఏళ్ల కితం నిర్మించిన కల్యాణ మండపానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 21వ తేదీ రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల వేడుకగా ఘనంగా నిర్వహించున్నారు. ఈ కల్యాణాన్ని వీక్షించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ అర్చకుడు మంగపతి అచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 19వ తేదీ ఆదివారం స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నారు. 20వ తేదీ సోమవారం నవకుంభారాధన పూజలు చేస్తారు. 21వ తేదీ మంగళవారం రాత్రి కీర్తిశేషులు వగ్వాల వెంకట రామారావు, వగ్వాల మాధవరాయుడు సహకారంతో నిర్మించిన కల్యాణ మండపంలో ఈ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసారు. ఎదురు సన్నాహం కార్యక్రమాన్ని మొగ్గల బాబు బంగారు లక్ష్మీ, నాగేశ్వర రావు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరగనుంది. ఈనెల 22వ తేదీ బుధవారం ఊరేగింపు, గరుడోత్సవం, 23వ తేదీ గురువారం చక్రస్నానం, పూర్ణాహుతి పూజలు, 24వ తేదీ శుక్రవారం పుష్పోత్సవం, ద్వాదశి కోవెల ప్రదక్షిణ పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 26వ తేదీ ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనా కుమారి అచ్యుతరామారావు, ఆలయాధికారులు తెలిపారు.

ఆయుష్మాన్ మందిర్ పరిశీలన


ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సర్పంచి సింధు, గ్రామస్తులు

ఉంగుటూరు: ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ని నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఆఫ్ హస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. తమిళనాడు నుంచి వచ్చిన పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఎస్ఆర్ డాక్టర్ బి కొత్త నయాగి, కమిటీ నోడల్ అధికారి డాక్టరు నీలిమ ఆసుపత్రి ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ప్రధానంగా రికార్డులు తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు శుభ్రత, మందులు, స్టాకు రిజిస్టరు, వైద్య విభాగాలను పరిశీలించారు. పంచకర్మ వైద్యం విభాగాన్ని పరిశీలించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు మంద జయలక్ష్మి,పీవీ పెద్దిరాజు ఆధ్వర్యంలో యోగా శిక్షణను గ్రామస్తులతో నిర్వహించారు. ఉంగుటూరు ఆయుర్వేద ఆసుపత్రి డాక్టరు కస్తూరి శిరీష్ కమిటీ సభ్యులకు సహకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సత్కరించి గౌరవించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావు, పరిమి శీతారామ్, కొత్త నాగేశ్వరరావు, అంబటి నరశింహమూర్తి పాల్గొన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సెరీకల్చర్ దోహదం

మల్బరీ తోటలను పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్ వాణి


మల్బరీ తోటను పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వాణి తదితరులు

దెందులూరు: మెట్ట ప్రాంత రైతులు, మల్బరీ సాగును సద్వినియోగం చేసుకుని కేంద్ర ప్రభుత్వ రాయితీలను పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వాణి అన్నారు. శుక్రవారం రామారావుగూడెంలో దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ పి.రత్తయ్యతో కలిసి మల్బరీ సాగు తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మల్బరీ సాగు ఎకరానికి రూ.3.14 లక్షలు మంజూరైందని, సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.3.60 లక్షలు, వడ్డీకి రూ.41 వేలు, ప్లాంటేషన్‌కు రూ.27 వేలు, అదనంగా రూ.30 వేలు మంజూరు చేసినట్టు తెలిపారు. మెట్టప్రాంత రైతులు సెరీకల్చర్ ద్వారా రైతులు గణనీయంగా దిగుబడి, ఆర్థికాభివృద్ధి, సాధించడాన్ని పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సాగు, జీవనం, అభివృద్ధి, భద్రత లక్ష్యంగా ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన పాఠ్య పుస్తకాలు సిద్ధం



భీమడోలులోని విద్యాకానుక పాయింట్‌లోని పాఠ్యపుస్తకాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏపీసీ సోమశేఖర్, కొత్త పుస్తకాలు పరిశీలిస్తున్న ఏపీసీ సోమశేఖర్

భీమడోలు: జిల్లాలోని మండల స్టాక్ పాయింట్ల వద్ద రానున్న విద్యాసంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సోమశేఖర్ అన్నారు.రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ పర్యటన ఈనెల 19వ తేదీ శనివారం భీమడోలులో ఉన్నందున శుక్రవారం ఎస్ఎస్ఏ ఉన్నతాధికారుల బృందం భీమడోలు ఉన్నత పాఠశాలలోని మండల స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉన్న కొత్త పాఠ్య పుస్తకాలను వారు పరిశీలించారు. విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరుకున్నదీ లేనిదీ ఏపీసీ సోమశేఖర్ మండల విద్యాశాఖాధికారులు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేసారు. 8,9,10వ తరగతులకు చెందిన విద్యార్థుల సంఖ్యకు సరిపడా పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని, ఈ ఏడాది నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి రానున్నందున పూర్తి స్థాయిలో పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు పలు సబ్జెక్టులకు చెందిన పుస్తకాలు చేరుకున్నాయన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున విద్యార్థులకు పుస్తకాలు అందిస్తామని ఏపీసీ, సీఎంవో జంగం రవీంద్ర తెలిపారు. అనంతరం ఏపీసీ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనకు సంబంధించిన వివరాలను వారికి వివరించారు. రికార్డులు, రిజిస్టర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎర్యటనలో భాగంగా భీమడోలు మండలంలోని గుండుగొలను ఉన్నత పాఠశాలకు ఉదయం చేరుకుంటారని ఆయన ఎంఈవోలకు వివరించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. విద్యా విషయాక అంశాలపై హెచ్ఎంలు పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణ, పీటీఏలు పాల్గొన్నారు.

26న శతాధిక పద్య కవుల సమ్మేళనం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 26న ఏలూరు నగరంలో శతాధిక పద్యకవుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శుక్రవారం శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యవర్గ సమావేశం శ్రీహరి కోటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే కాక దేశంలోని అనేక ప్రాంతాల్లో సాహిత్య, కళాప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరులో గొప్ప సాహిత్య కార్యక్రమంగా శతాధిక పద్య కవుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి నగరంలోని సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు విశేషంగా సహకరిస్తున్నారన్నారు. శతాధిక పద్యకవుల సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు టీ. పార్థసారధి, ఉపాధ్యక్షుడు కౌంతియాల కస్తూరి రావు, మహిళా అధ్యక్షురాలు శ్యామల హరి కోటి, కార్యదర్శులు ఎంజే సుజయకృష్ణ, గురు శర్మ, గోరింక ఐజక్, ఈడా నాగేశ్వర రావు, అనూరాధ పురం, వీవీఎస్ గౌతం పాల్గొన్నారు.

శారీరక వ్యాయామంతో రక్తపోటు అదుపు


పిప్పర పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: రక్తపోటు ప్రాణాంతకమైనదని, జీవన శైలిలో మార్పుల ద్వారా రక్తపోటును అదుపులో ఉంచవచ్చునని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.ప్రియాంక, సంతోష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా రక్తపోటు వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవడం, దుర్వసనాలు, జంక్ ఫుడ్స్, జన్యుపరమైన లక్షణాలు తదితర కారణాల వల్ల రక్తపోటు వస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. 30 ఏళ్ల వయస్సు దాటిన వారు క్రమం తప్పకుండా బీపీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ, నిత్య వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు ఆచరిస్తే రక్తపోటును అదుపులో ఉంచవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో..

ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సీలో రక్త పోటు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి రక్తపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తపోటు అదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు కనీసం అర్ధగంట సమయం నడక, శారీరక వ్యాయామాలకు కేటాయిస్తే ఎలాంటి రోగాలు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం


కారు మబ్బులతో నిండిన ఆకాశం


ధాన్యానికి టార్పాలిన్ కప్పకుంటున్న రైతులు

పెదవేగి : పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వడగాల్పుల ప్రభావంతో ఉక్కిరిబిక్కిరవుతున్న మండలంలోని ప్రజలకు తుఫాన్ ప్రభావంతో శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షం ఊరటనిచ్చింది. వేసవి ప్రారంభంలో ఉష్ణతాపం మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఒక్కసారిగా ఈదురు గాలులు, మెరుపులతో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. వర్షానికి ముందు విపత్తు నివారణ శాఖ పిడుగులు పడతాయని చేసిన హెచ్చరికలతో స్థానిక రెవెన్యూ అధికారులు మెసేజ్‌ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ శాఖధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తుఫాన్ ప్రభావం వల్ల ఇలాంటి వాతావరణం ఏర్పడుతున్నట్లు విపత్తు నివారణశాఖ సమాచారం అందించినట్లు మండల అధికారులు చెప్పారు. ఇదిలా ఉంటే ధాన్యం బయట ఆరబోసుకున్న రైతులు ఆకాశంలో కమ్ముకుంటున్న కారు మబ్బులు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న చినుకులు చూసి బెంబేలెత్తిపోతున్నారు. ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పుకుంటూ, నానా తంటాలు పడుతున్నారు.